
# ఉపవాసం



అవధానుల సుధాకర రావు

నిరంజనశర్మ ఆ రోజు ఉదయం ఆఫీసుకి బయల్దేరుతూ-"నే నీ రోజు ఇంటికి రావడం కాస్త ఆలస్యం కావచ్చు. భోజనానికి నా కోసం ఎదురుచూడొద్దు" అని చెప్పాడు భార్యతో.

"ఏమిటి విశేషం?" కుతూహలం దాచుకోలేకపోయింది సావిత్రి.

"ఏం లేదు. నా బెస్ట్ ఫ్రండ్ ఒకతను - నా మీద అభిమానంతో ఓ చిన్న 'పార్టీ' ఏర్పాటు చేశాడు ఈ రోజు."

"సరే. మంచిది."

నిరంజన శర్మ "హమ్మయ్య" అంటూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. 'హెడ్డాఫీను' అనుమతి లభించింది. ఇక, నిస్సంకోచంగా 'పార్టీ'ని పూర్తిగా 'ఎంజాయ్' చెయ్యడమే తన వంతు.

** ** **

శర్మ ఆ రోజు ఆఫీసుకి వెళ్ళాడు గాని, పనిమీద మనసు పెట్టలేకపోయాడు. ఎప్పుడు అయిదు, అవుతుందా నని పదే పదే వాల్ క్లాక్ మీదకు దృష్టిని మళ్ళించడంతోనే సరిపోయింది.

సరిగ్గా అయిదు గంటల సమయంలోనే 'బాస్' పిలిచి, ఏదో అర్జెంటు వర్కు అంటగట్టే ప్రమాదం ఉందని-క్రితం రోజునే ఆయన్ని కలిసి, మరునాడు సాయంత్రం కచ్చితంగా అయిదు గంటలకి తను వెళ్ళిపోవడానికి పర్మిషన్ అడిగి, ఓ. కే. అనిపించుకున్నాడు.

ఇంతకీ, నిరంజన శర్మ చేసే ఈ హడావుడి వెనక ఉన్న కథేమిటో మీకు చెప్పలేదు కదూ !

క్రితం రోజు జగదీష్ అతన్ని ఫోన్ ద్వారా కలిసేడు. వాళ్ళిద్దరూ చిన్ననాటి మిత్రులు. ఇద్దరి మధ్యా ఏ అరమరికలు, దాపరికాలు ఉండవు. ఇద్దరూ సహవిద్యార్థులు. ఇద్దరూ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే అయినా - ప్రస్తుతం పరిస్థితి అలా లేదు. జగదీష్ ఎదిగిపోయి, లక్షాధికారుల జాబితాలోకి చేరిపోయాడు. ఏ మార్పూ, ఎదుగూ బొదుగూ లేకుండా నిరంజన శర్మ గుమాస్తా ఉద్యోగంతో బ్రతుకు బండిని లాగుతున్నాడు.

తన స్నేహితుడు అందనంత ఎత్తుకి పెరిగిపోవడం - శర్మకి పెద్ద ఆశ్చర్యమేమీ కలిగించదు. ఎందుకంటే, 'జగన్'గాడు అఖండుడు. చిన్నతనం నుంచీ కూడా వాడిది చావుతెలివి.

ఈ రోజు వా డొక పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఈనాటి వాడి అంతస్తుల పునాదుల కింద - ఏవేవో లొసుగులు ఉండొచ్చు. వాడి ఉన్నత స్థితి వెనుక - కొన్ని అవకతవకలు ఉన్నాయన్నదీ నిజమే. కాని, అవన్నీ ఎవరికి కావాలి? వాడి దగ్గర ధనలక్ష్మి ఉంది. అది చాలు. చెలామణీ అయిపోవడానికి.

సరే. ఇంతకీ విషయమేమిటంటే - జగదీష్ స్వయంగా ఫోన్ చేసి, "ఒరే శర్మా ! మనం కలిసి చాలా కాలమయింది. రేపు బుధవారంనాడు నీతో ఓ రెండు గంటలు కాలక్షేపం చెయ్యడానికి నిశ్చయించుకున్నాను. ఏమంటావురా?"

"అలాగే" ఒప్పుకున్నాడు శర్మ. ఎందుచేతనో గాని, తను కూడా వాడిని ఇదివరలో మాదిరిగా "ఏరా" అనలేకపోతున్నాడు.

"థాంక్యూ ! 'హిమాయత్‌నగర్'లో ఉన్న నీ "ఫేవరేట్ బార్"లో మనం కాలక్షేపం చేద్దాం. నువ్వు నాచేత ఎంత ఖర్చు పెట్టిస్తావో - అది నీకు వదిలిపెడుతున్నాను. నిన్ను రేపు 'కోఠి'లో ఉన్న 'షాలిమార్ స్వీట్స్' దగ్గర కారులో పికప్ చేసుకుంటాను. సాయంత్రం ఆరుగంటలకల్లా అక్కడ ఉండాలి" అని చెప్పి, ఫోన్ పెట్టేశాడు.

అప్పట్నుంచీ నిరంజన శర్మకి పండుగలా ఉంది. ఎప్పుడెప్పుడా అని లొట్టలు వేసుకుంటూ, క్షణాలు లెక్కపెట్టసాగేడు.

స్కాచ్ తాగాలన్న తన చిరకాల వాంఛ ఇప్పటికి గదా నెరవేరుతోంది ! తనకు 'డ్రింక్' మీద పెద్దగా మక్కువలేదు గాని - "ముక్కల"ంటే మహాప్రీతి. మందు కొడుతూ ఎన్. వి. తినడం-ఓహ ! అ దో గొప్ప అనుభవం.

హిమాయత్‌నగర్‌లో ఉన్న ఆ బార్ చాలా ఖరీదైనది. సగటు మనిషి అందులో ప్రవేశించడానికి అనర్హుడు. అప్పుడప్పుడూ ఆ జగన్‌గాడి పుణ్యంవల్లనో, లేక ఆఫీసులో తనకి దొరికే గిరాకీల ధర్మంవల్లనో ఏడాదికి ఒకటీ, రెండుసార్లు ఆ బార్‌కి వెళ్ళే భాగ్యం కలుగుతుంది తనకి. ఎంతో రుచిగా ఉండే అక్కడి 'డిషెస్' తల్చుకుంటేనే నోట్లో నీళ్ళూరుతా యి కదా !

ఈ అవకాశం చాలా రోజుల తరువాత దొరికిందనేమో శర్మ చాలా ఆత్రంగా ఉన్నాడు. తను శోభనం రోజున కూడా ఇంత ఇదిగా ఎదురుచూడలేదంటే - అతిశయోక్తి కాదు.

ఏమైనా సరే ఈ రోజు చికెన్‌లు, గికిన్‌లు సుష్టుగా పట్టించాలి. అన్ని వెరైటీలు రుచ్చూసి, పూర్తిగా తన మోజు తీర్చుకోవాలి. అందుకే అతను ఆ రోజంతా ఏమీ తినకుండా, కడుపు ఖాళీగా ఉంచుకున్నాడు.

** ** **

టీ, కాఫీలు ఆకలిని చంపేస్తాయని వాటిని దరికి చేరనివ్వలేదు. తన మిత్రు డిచ్చే విందుకు పూర్తి న్యాయం చెయ్యాలని - ఆ రో జతను కచ్చితమైన 'ఉపావసం' పాటించేడు. అందుకేనేమో, సాయంత్రం అయ్యేసరికి అతను తోటకూర కాడలా వడలిపోయి ఉన్నాడు. నిలబడేందుకైనా ఓపికలేని నీరసం, నిస్సత్తువ, కళ్ళు తిరిగినట్లుగా కూడా అనిపిస్తోంది మధ్య మధ్య.

సాయంత్రం ఆరు దాటింది. నిముషాలు గడుస్తున్నాయి గాని, జగదీష్ జాడలేదు. శర్మ కళ్ళలో వత్తులేసుకుని ఎదురుచూడసాగేడు. అతని పొట్ట బాగా లోతుకుపోయి, పేగులు ఆకలి

కీర్తనలు అలపిస్తుంటే, శర్మ ఏం చెయ్యడమా - అని పిచ్చివాడిలా, దిక్కుతోచని స్థితిలో ఉండగా-

షాలిమార్ స్వీట్స్ తాలూకు ఒక వర్కర్ వచ్చి, "సార్, నిరంజన శర్మగా రంటే తమరేనా?" అనడిగేడు. అవునని జవాబిచ్చాడు శర్మ.

"అయితే రండి. మా షాపుకి మీకు ఫోనొచ్చింది" అంటూ పిల్చుకెళ్ళాడు.

శర్మ రిసీవర్ అందుకుని, "హలో" అన్నాడు.

అవతలివేపు జగదీష్. "సారీరా! మన ప్రోగ్రాం కాన్సిల్. నేను ఉన్నవళంగా, అత్యవసరమైన పనిమీద అనంతపురం బయల్దేరి వెళ్తున్నాను. ఏమనుకోకు. ఇంకోసారి కలుద్దాం." అవతలివేపు ఫోన్ పెట్టేసిన చప్పుడు.

శర్మ కాళ్ళీడ్చుకుంటూ బయటి కొచ్చాడు. భంగపాటు-పరాభవం ! అతన్ని పరిహసిస్తూ ఎక్కడ్నుంచో పాట వినిపిస్తోంది.

"మనసా, ఆశపడకే" అంటూ.

ఏం చెయ్యా లిప్పుడు? నెలాఖరు రోజులు కాబట్టి, జేబులో రూపాయి మాత్రమే ఉంది. అది సిటీబస్సు టిక్కట్టుకి సరిపోతుంది. కడుపులో ఆకలి తీవ్రంగా ఉంది. ఏ క్షణంలో కళ్ళు తిరిగి, శోషవచ్చి పడిపోతాడో అన్నట్లుగా ఉంది పరిస్థితి.

** ** **

శర్మ ఇల్లు చేరుకునేసరికి రాత్రి ఎనిమిదయింది. ఆ సాయంత్రమే ఊరు నుండి కూతురు, అల్లుడు దిగడంతో ఇల్లంతా హడావుడిగా, సందడిగా ఉంది. ఇంకో గమ్మత్తయిన విషయం ఏమిటంటే-శర్మ వచ్చే సమయానికి సరిగ్గా అప్పుడే అంతా భోజనాల ముందు కూర్చున్నారు.

భర్త రాకకి సావిత్రి హడావుడి పడింది. అతనికి లుంగీ, అదీ అందించి- "చాలా తొందరగానే వచ్చేశారే ! పార్టీ బాగా జరిగిందా?" ఆదరం, అభిమానం కలగలిసిన గొంతుతో ప్రశ్నించింది.

శర్మ ఏదో భావంతో, అస్పష్టంగా తలూపేడు. సావిత్రి తన కోణంలోంచి ఆలోచించి, పార్టీ బాగానే జరిగింది అనుకుంది.

శర్మ బాత్‌రూంకి వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కుని డైనింగ్ రూంలోకి వచ్చేడు. కూతుర్నీ అల్లుణ్ణీ కుశల ప్రశ్న లడిగేడు. ఆ రోజు సావిత్రి రకరకాల ప్రత్యేక పిండివంటలు చేసింది. వాటి గమగమలు శర్మకి నోరూరిస్తున్నాయి.

"ఏమండీ ! మీరు కూడా ఏమన్నా తినకూడదూ?" సావిత్రి అడిగింది.

శర్మకి మొహమాటం అడ్డొచ్చింది.

"లాభంలేదు సావిత్రీ ! పొట్టలో ఏమాత్రం ఖాళీ లేదు." ఆ జవాబు చెప్పడానికి ఎంతో నతమతమయ్యాడు శర్మ.

జీడిపప్పు పలుకులతో, కూడిన పాయసం సువాసన శర్మని పిచ్చివాణ్ణి చేస్తోంది.

గుమ్మడికాయ పులుసు, గడ్డపెరుగు.

శర్మ కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. నిన్నట్నుంచీ తను నాలికమీద ఏదీ వేసుకోలేదు.

ఒరేయ్ శర్మా, ఇది నీ కర్మ ! నీ ఇంట్లోనే, నీ వాళ్ళమధ్య నీవు పరాయివాడివి. మొహమాటంతో కడుపు మాడ్చుకుంటున్నావు. ఆకలితో ఈ రాత్రి నువ్వు నిద్రపోగలవా?

ఒరేయ్ పిచ్చివాడా. మబ్బుల్లో నీళ్ళు చూసి, ముంత ఒలకబోసుకోవడం అంటే ఇప్పటికైనా అర్థమైందా? అని అంతరాత్మ చీవాట్లు పెడుతుంటే, శర్మ ముఖం చిన్నబుచ్చుకున్నాడు. *

## మినీ కథ

# బ్యూటీ...బ్యూటీ

-బుధ

"ఈ రోజు నిన్నొదలను ప్రశాంత్. రోజూ చెప్పా చెయ్యకుండా ఎక్కడికో వెడుతున్నావ్!" వెంటనే వస్తూ అన్నాడు మధు.

"ఎక్కడికో ఎందుకు? బ్యూటీ దగ్గరికే!" తాపీగా వచ్చింది ప్రశాంత్ సమాధానం.

"అంటే? ఇంకేం మన 'కేటగిరే' అన్న మాట! నీ వెప్పుడూ పుస్తకాల ముందు కూర్చుంటుంటే నిన్ను వెలి వేశామనుకో!"

"గుడ్!"

"ఇంతకూ 'పిట్ట' దార్లో కొచ్చిందా? లేక వన్ సైడేనా?"

"నీ వనేది నా కర్థం కావడం లేదు."

"అమాయకుడిలా నటించకు మిత్రమా!" మధు అన్నాడు.

"నేనేం అమాయకుణ్ణి కాదులే!"

"అదుగో అబ్బ! ఏమి ఒంపులు ఏమి నడక! పిండి బొమ్మలా మలుపు తిరుగుతోంది. తిరిగింది. కొట్టు గురూ ఫాలో! స్ట్రెయిటుగానే వెడుతున్నావేం?" ప్రశాంత్ చేయి పట్టి నిలపబోయాడు వాను.

"ఆమెతో పని లేదు." క్లుప్తంగా అని చెయ్యి విడిపించుకొని ముందడుగు వేశాడు.

"సరే పద నీతో నే వస్తా. నీ బ్యూటీ ఎలాంటిదో చూస్తా."

"అయ్ రియల్లీ పిటీ యూ!"

"అసలే నేను ఇంగ్లీషులో పూర్. మనం మనం ఒకే గూటి పక్షులం గనుక తేట తెలుగులో చెప్పు బ్రదర్!"

"నా బ్యూటీని నీ వొక్కసారి చూశావంటే ఎవ్వరి జోలికీ పోలేవు!"

"అమ్మో! అయితే చూడాల్సిందే నీకు మాత్రం అడ్డు రాను. ప్రామిస్!"

"చూపుతా పద."

"అమ్మమ్మో! ఎదురొస్తోంది చూడు గురూ! నరనరాల్లోంచి సత్తా అంతా లాగేస్తూంది గురూ! సింప్లీ బ్యూటీఫుల్. అబ్బ అక్కడ పడే ఆ మడత చూడు."

ఎదురొచ్చే వయ్యారాల పరువాన్ని వర్ణించాడు మధు.

"ప్చ్!..." ముందుకు సాగిపోయాడు ప్రశాంత్.

"ఊరి బయటి కొచ్చేస్తున్నాం!

రోజూ ఇక్కడ కలుసుకుంటున్నారా?

ఎవ్వరూ లేకుండా చూసి లొంగదీసుకోలేదు కదా?"

"నేనే లొంగిపోయాను. నేనే లొంగిపోయాను." కాస్త తన్మయత్వంతో అన్నాడు ప్రశాంత్. "అరిటాకు ముల్లు వద్దా, ముల్లు మీద అరిటాకుపై పడ్డా అంత ఒకటే! మొత్తానికి పైకి పైకి అమాయకుడిలా కనిపించినా అసాధ్యుడివే!"

"ఇక్కడ కూర్చుందామా?" పచ్చిక వంక నడిచాడు ప్రశాంత్.

"నీ పక్కన నన్ను చూసి నీ బ్యూటీ రాదేమో! కాస్త దూరంగా ఉండమంటే కూడా ఏమనుకోనులే."

"ఇంతకూ నా బ్యూటీ ఎవరను కుంటున్నావ్? ఎక్కడుంది అనుకుంటున్నావ్?

"అదిగో...

చెట్టు చేమల్లో... వంక వాగుల్లో... కొండ గుట్టల్లో... ఎగిరే పక్షుల్లో... పారే సెలయేట్లో... చల్లని ప్రశాంత వాతావరణంలో ప్రశాంతంగా ఉన్న ప్రతి మనసులో... బ్యూటీ ఈస్ ట్రూత్ ట్రూత్ బ్యూటీ దట్ ఈజ్ ఆల్!" ప్రఖ్యాతమైన కొటేషన్‌తో ముగించాడు ప్రశాంత్.

ప్రశాంత్ పక్కనే ఉన్నా తనకూ, ప్రశాంత్‌కూ మధ్య ఎన్నో వేల మైళ్ళ దూరం ఉన్నట్టు కనిపించింది మధుకు "బ్యూటీ... బ్యూటీ" గొణుక్కున్నట్టుగా అనుకున్నాడు మధు. ★

